క్లుప్తంగా

యాదవ సంఘం అధ్యక్షుడిగా విజయ్


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

దేవరకొండ : యాదవ సంఘం దేవరకొండ పట్టణ నూతన అధ్యక్షుడిగా నల్లగాసు విజయ్ ఎన్నికయ్యారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా నాయకులు నక్క వెంకటేష్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పట్టణ అధ్యక్షుడిగా ఎన్నుకున్న సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ విజయ్‌కు నియామక పత్రం అందజేసి మాట్లాడారు. ఈ సమావేశంలో నల్లగాసు జాన్‌యాదవ్, నేతాళ్ల వెంకటేష్, కొండ్ర మల్లీశ్వరిశ్రీశైలం, మల్లయ్య, నోముల యాదయ్య, నేతాళ్ల నరసింహా,నే తాళ్ల శ్రీనివాస్, తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతాయని దేవరకొండ మండలం మైనంపల్లి మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ అన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తున్న స్ప్రింక్లర్ పైపులను మంగళవారం ఆమె గ్రామ రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ చొరవతో గ్రామానికి చెందిన రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్లు, పైపులను అందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండునాయక్, సీత్యానాయక్, మకట్‌లాల్, శ్రీను, ప్రశాంత్, మంగు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'చలో వరంగల్' పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : వరంగల్‌లో ఫిబ్రవరి 2న నిర్వహించే రాజకీయ యుద్ధభేరి సభ (హలో బీసీ –చలో వరంగల్) పోస్టర్‌ను మంగళవారం బీసీ భవన్‌లో నాయకులు ఆవిష్కరించారు. బీసీలు భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తమ్మడబోయిన అర్జున్, కోల సైదులు, తిరుమలగిరి అశోక్, గాధగోని మహేష్, దాసరాజు జయరాజు, పుప్పాల సత్యం, గంగాధర్, అంజి గౌడ్, సిద్ధం రాజు, బండి రాజు, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, ప్రశాంత్, రాంబుబు, నానీ, ఉపేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నాగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాండురంగారెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు శాగం పెద్దిరెడ్డి సోదరుడు నాగిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి, నాగేండ్ల కృష్ణారెడ్డి, నాగేండ్ల సీతారాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కోటిరెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కొండమల్లేపల్లి : గుర్రంపోడు మండలంలోని పాల్వాయి గ్రామానికి చెందిన వేమిరెడ్డి సునీత అనారోగ్యంతో బాధపడుతూ నల్లగొండలోని సంరక్షణ ఆస్పత్రి చికిత్స పొందుతుంది. ఆపరేషన్ నిమిత్తం డబ్బులు అవసరం కావడంతో విషయం తెలుసుకున్న సునిత పదో తరగతి స్నేహితులు రూ.26,300 సేకరించి వైద్య ఖర్చుల నిమిత్తం మంగళవారం నల్లగొండలోని ఆస్పత్రిలో ఆమెను కలిసి ఈ మేరకు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధారాణి, శ్రీలత, అనిల్, వెంకటయ్య, నాగమణి తదితరులున్నారు.

సాగర్ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


పెద్దవూర : హాస్టల్‌లో గుడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాగార్జునసాగర్ : సాగర్ ఏరియా ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం సాగర్‌లోని ప్రభుత్వ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని ఆమె సందర్శించారు. ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించి, ఆర్ఎంఓ డాక్టర్ భానుప్రసాద్, సీఎంఓ డాక్టర్ హరికృష్ణ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆస్పత్రిలో అడ్వాన్స్ టెక్నాలజీ వైద్యపరికరాలు, సమర్థులైన డాక్టర్లు ఉన్నారని.. సమీపంలోని రోగులంతా వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సకల సౌకర్యాలతో ఆస్పత్రి నూతన భవనం ఉందన్నారు. ఆస్పత్రిలో 108కు డ్రైవర్ లేరని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. వెంటనే డ్రైవర్‌ను నియమిస్తామని తెలిపారు. అనంతరం ఆస్పత్రి పాత భవనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట పెద్దవూర తహసీల్దార్ సరోజ పావని ఉన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాన్ని(పీహెచ్‌సీ) ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సమీకృత బాలికల వసతి గృహాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యసిబ్బంది హాజరు పట్టిక, ఓపీ వివరాలు, మెడిసిన్ రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరి చిన్నపాటి వర్షం వచ్చినా సిబ్బంది, రోగులు భయాందోళనలకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందని తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ప్రారంభమై ఏడాది అవుతున్నా అవుతున్నా ఇప్పటికీ ఎందుకు పూర్తి చేయలేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మార్చి నెలలో మంత్రులతో ప్రారంభించడానికి సిద్ధంగా ఉంచాలన్నారు. హైరిస్క్ రిజిష్టర్‌లను అన్ని పీహెచ్‌సీలకు అందించాలని ఫోన్‌లో డీఎంహెచ్ఓతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయొద్దని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలికల వసతృగృహం తనిఖీ

మండల కేంద్రంలోని సమీకృత బాలికల వసతిగృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు, డార్మిటరీలను, వంట గది, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థినులు నిద్రించే బెడ్‌లపై పరుపులు లేకుండా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ పరుపులు ఎటు పోయాయి అని వార్డెన్‌ను ప్రశ్నించగా ఐదేళ్ల క్రితం ఇవ్వడంతో చిరిగిపోయాయని తెలిపింది. దీంతో వాటిని తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకుని త్వరలోనే పరుపులు వచ్చేలా చూస్తానని వార్డెన్‌కు తెలిపారు. గుడ్లు నాణ్యమైనవా లేదా అని ఒక గిన్నెలో నీటిని పోసి అందులో గుడ్లు వేయించి వార్డెన్ సమక్షంలో పరిశీలించారు. హాస్టల్ దూరంగా ఉండటంతో నిత్యం పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ పావని, డాక్టర్ నగేష్, తరి రాములు, పంకజ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వార్డెన్, సీహెచ్‌ఓ ఉన్నారు.

బైక్ రేసింగ్ చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ రాజశేఖర్‌రాజు


రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణ కేంద్రంలో బైక్ రేసింగ్‌కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు అన్నారు. మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మిర్యాలగూడలోని ఈదులగూడెం చౌరస్తా నుంచి అద్దంకి–నార్కట్‌పల్లి బైపాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు కొంతమంది బైక్ రేసింగ్, బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రధాన రోడ్లలో అతివేగంగా వాహనాలు నడిపితే వాటిని పట్టుకొని సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా త్రిబుల్ రైడింగ్‌కు, హెవీ సైలెన్సర్ కలిగి ద్విచక్రవాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వార్డుల్లో వీధి వ్యాపారులు కూడా మైకులను పెట్టి ప్రజలకు ఇబ్బందిగా మారుస్తున్న వారు సౌండ్‌తో వచ్చే మైకులను తీసుకొని తిరగవద్దన్నారు. మిర్యాలగూడ సబ్ డివిజన్‌లో అనుమానితులుగా ఎవరైనా కనబడితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐలు లోకేష్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

భవనాలు అందుబాటులోకి తేవాలి


బీసీ భవనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ టౌన్ : కుల భవన సముదాయాలు, కళాభారతిని ప్రజలకు 20 రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. మంగళవారం రూ.3కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవనం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ భవనం, సంతుసేవాలాల్ ఎస్టీ భవనాలతో పాటు మినీ రవీంద్రభారతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా భవనాల్లో అన్ని వసతులను కల్పించాలని, అదే విధంగా మినీ రవీంద్రభారతి(కళావేదిక)ను కాంట్రాక్టర్ వద్ద నుంచి మున్సిపల్ శాఖ స్వాధీనం చేసుకోవడంతో పాటు ఏమైన మైనర్ మరమ్మతులు ఉంటే వేగవంతంగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఉన్నారు.

పాఠశాలకు రూ.1.25లక్షల విరాళం


ప్రధానోపాయుడికి చెక్కు అందజేస్తున్న దాత సందీప్‌రెడ్డి

వేములపల్లి (మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలోని చర్లగూడెం గ్రామానికి చెందిన గోలి లింగారెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గోలి సందీప్‌రెడ్డి ఆగామోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు కంప్యూటర్లకుగాను రూ.1.25లక్షల విలువైన చెక్కును పాఠశాల హెచ్‌ఎం వినోద్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గోలి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ప్రపంచమంతా కంప్యూటర్ యుగం నడుస్తుందన్నారు. భవిష్యత్‌లో పాఠశాలకు మరిన్ని కంప్యూటర్లు అందిస్తానన్నారు. అనంతరం సందీప్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోలి నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు నగేష్, జనార్దన్, నరేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, ఆనందరెడ్డి, గురవయ్య, రమాజ్యోతి పాల్గొన్నారు.

దరఖాస్తులతో మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

డిండి : సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించక పోవడంతోపాటు తిరిగి మరల దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆ పార్టీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన గ్రామ సభలు పోలీసుల పహారా నడుమ నిర్వహించడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక ఉందడానికి ఉదాహరణగా చెప్పొచ్చని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని వినతి


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

చింతపల్లి : మండలంలో డిప్యూటేషన్లపై విధులు నిర్వరిస్తున్న ఉపాధ్యాయులను వారి సొంత పాఠశాలలకు పంపించాలని టీఎస్ యూటీఎఫ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిలువేరు నారాయణ, ముసుగు ఆనంద్ బాబు మండల విద్యాధికారి నీరుడు అంజయ్య కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సిలివేరు నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా, తమ సొంత ప్రయోజనాల కోసం హైదరాబాదుకు దగ్గరగా ఉన్న చింతపల్లి మండలానికి అనేక మంది ఉపాధ్యాయులు అక్రమ డిప్యూటేషన్లపై వచ్చి మండల కేంద్రాన్ని పునరావాస కేంద్రంగా మార్చుకొని విధులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు.

మతోన్మాదశక్తులకు నిలయంగా మార్చేందుకు కుట్ర


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్

హాలియా : విశ్వవిద్యాలయాలను మతోన్మాద శక్తులకు నిలయంగా మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎస్ఎఫ్ఐ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ ఆరోపించారు. మంగళవారం హాలియా పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య యూజీసీ నిబంధనల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను లాక్కుంటుందని, దేశంలో విద్యను వ్యాపారంగా కేంద్రీకరణ కార్పొరేటీకరణ చేసే విధంగా బీజేపీ పూను కుంటుందని ఆరోపించారు. విశ్వవిద్యాలయాలను విధ్వంసం చేసే యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వ్యతిరేకించాలన్నారు. మోదీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నలబెల్లి జగదీష్, కోరే రమేష్, శివ, అంజి, గోపి, వర్షిత్ తదితరులు ఉన్నారు.

స్తంభాలు వేశారు.. తీగలు మరిచారు


పెద్దవూరలో తీగలు లేకుండా ఉన్న విద్యుత్ స్తంభాలు

పెద్దవూర : మండల కేంద్రంలోని రెడ్డి కాలనీలో శాసనసభ ఎన్నికలకు ముందు పెద్దవూర–గర్నెకుంట రహదారి నుంచి ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడం స్తంభాలు వేశారు. స్తంభాలు ఏర్పాటు చేసి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటివరకు విద్యుత్ తీగలు వేయడం మర్చిపోయారు. దీంతో విద్యుత్ వినియోగదారులు చాలా దూరం నుంచి ఇళ్లలోకి తీగలను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను పొందాల్సి వస్తుంది. బలమైన ఈదురు గాలులు వీచినప్పుడు చాలా దూరం నుంచి ఏర్పాటు చేసుకున్న కేబుల్ తీగలు తెగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు తీగలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పి ంచాలని గత ప్రజాపాలన కార్యక్రమంలోనూ, గ్రీవెన్స్ డేలోనూ కాలనీ వాసులు రెండు, మూడు సార్లు అధికారులకు విన్నవించారు. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ స్తంభాలకు తీగలను బిగించాలని కోరుతున్నారు.

ప్రత్యేక అధికారిని కలిసిన మున్సిపల్ కమిషనర్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపల్ ప్రత్యేక అధికారిగా నియమితులైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి. శ్రీనివాస్‌ను మంగళవారం మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌ను మున్సిపాలిటీకి చెందిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ భూముల సేకరణ


ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

మిర్యాలగూడ : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను సేకరిస్తున్నట్లు తహసీల్దార్ హరిబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని రాయినిపాలెం గ్రామంలోని సర్వే నంబర్ 414లో 2.10ఎకరాలు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములను పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని సర్వే నంబర్ 71లో 25గుంటల ప్రభుత్వ భూమిని పరిశీలించామని, ఆలగడప గ్రామ పరిధిలోని సుబ్బారెడ్డి గూడెం గ్రామ శివారులోని సర్వే నంబర్ 795లో 7.12ఎకరాల పట్టా భూమి గతంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించినట్లు తెలిపారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో ఇళ్లు లేకపోవడంతో వాటిని రద్దు చేసి ఆ భూములను ఏదైనా ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించేందుకు పరిశీలిస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ సత్యనారాయణ ఉన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

దేవరకొండ : మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న ఏబీసీడీ వర్గీకరణ అమలు కోసం చేపట్టిన «వేయి గొంతుకలు. లక్ష డప్పులు» మహాప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బహిరంగసభకు దేవరకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ తలపెట్టిన సభకు వేలాదిగా తరలిరావాలని వారు అన్నారు. ఈ సమావేశంలో నాయకులు, పాల్గొన్నారు.

చింతపల్లి : ఫిబ్రవరి 7న నిర్వహించనున్న ఏబీసీడీ వర్గీకరణ అమలు కోసం నిర్వహించే బహిరంగ సభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వింజమూరి కృష్ణయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న లక్ష డబ్బులు, వేయి గొంతుకలు అనే బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, ఎర్ర జగన్, వెంకటరమణ, మాస అని పెద్దయ్య, శంకర్, రాజు ఉన్నారు.

దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి


వ్యవసాయ మార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మిర్యాలగూడ : అచ్చంపేట మార్కెట్‌యార్డు కార్యాలయంపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని టీఎన్‌జీఓ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు బాల్‌శెట్టి మధుబాబు అన్నారు. మంగళవారం మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉద్యోగస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ఆయన మాట్లాడారు. ధరల విషయంలో హెచ్చు తగ్గులకు మార్కెట్ కార్యదర్శికి, సిబ్బందికి ఎలాంటి సంబంధం ఉండదని, ఆయా పరిస్థితులకు అనుగుణంగా హెచ్చుతగ్గులను సమీక్షించి సమన్వయం చేస్తారన్నారు. అసహనానికి గురైన కొందరు అనాలోచితంగా కార్యాలయంపై దాడి చేసి చైర్‌పర్సన్, కార్యదర్శి, సిబ్బందిపై భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాధర్నాకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు


కొండమల్లేపల్లి : రైతు మహాధర్నాకు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కొండమల్లేపల్లి : జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన రైతు మహాధర్నాలో పాల్గొనేందుకు కొండమల్లేపల్లి మండలం నుంచి బిఆర్ఎస్ శ్రేణులు బయల్దేరి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కేసాని లింగారెడ్డి, మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, తులసిరాం, యాదయ్య, పెద్దిశెట్టి సత్యం, నరేందర్, శేఖర్, వెంకటేష్, రావుల సత్యనారాయణ, కృష్ణయ్య, శంకర్‌నాయక్, వెంకటేష్, భీమ, యాదయ్య, బాలు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : నల్లగొండలో నిర్వహించే రైతు మహాధర్నాకు అడవిదేవులపల్లి మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో నాయకులు బాలాజీనాయక్, సేవ్యానాయక్, కొత్తమరెడ్డి, శ్రీను, భీమా, లింగయ్య, వెంకటేశ్వర్లు, హుస్సేన్, లకపతి, స్వామి,, బాబ్జి, ప్రసాద్, రవి, సైదులు, రత్నాకర్ తదితరులున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : స్వపరిపాలన దినోత్సవాన్ని మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రత్యేకమైన వస్త్రాధారణలో విధులను నిర్వర్తించి పలువురి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌ఓ కవిత మాట్లాడుతూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నతమైన స్థాయికి చేరుకోవచ్చన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణి, సునిత, కవిత, పుష్పలత, బ్యూలోరాణి, విమల, హిమబిందు పాల్గొన్నారు.

మిరప కోతలకు కూలీల కొరత

- పక్క మండలం నుంచి తీసుకొస్తున్న రైతులు
- ఖర్చు ఎక్కువ అవుతుందని ఆవేదన


తాలు కాయలను ఏరుతున్న కూలీలు


కొత్తగూడెంలో ఎండబెట్టిన మిరప కాయలు

పెద్దవూర : నాన్ ఆయకట్టు ప్రాంతమైన మండలంలో మిరప కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతేడాది పత్తి ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడం, వానాకాలం సీజన్‌లో మండలంలో వెయ్యి ఎకరాలకు పైగా మిరప పంటను సాగు చేశారు. మండలంలోని గర్నెకుంట, బట్టుగూడెం, వెల్మగూడెం, బసిరెడ్డిపల్లి, పెద్దగూడెం, తుంగతుర్తి, నాయినవానికుంటతండా, పెద్దవూర, కేకేతండా, పొట్టివానితండా, చలకుర్తి, బోనూతల, చింతపల్లి, రామన్నగూడెం తదితర గ్రామాల్లో మిరప పంటను విరివిగా సాగు చేశారు. మండల వ్యాప్తంగా మిరప కాయలు ఒకేసారి కోతకు రావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. వాతావరణంలో మార్పులకు ఈ ఏడాది మిరప పంటను తెగుళ్లు, పురుగుల బెడద తీవ్రంగా ఉంది. దీంతో మిరపలో తాలు శాతం పెరిగింది. ఏరిన మిరప కాయలను ఎండబెట్టిన తర్వాత తాలు కాయలు ఏరటానికి సైతం కూలీల అవసరం ఉంది. దీంతో చేలలో మిరప కాయలు ఏరటంతో పాటు తాలు కాయలు ఏరటానికి కూలీలు వస్తున్నారు.

ఇతర మండలాల నుంచి కూలీలు..

గ్రామాల్లో కూలీలు దొరకకపోవడంతో అనుముల, తిరుమలగిరి, పెదఅడిశర్లపల్లి, గుర్రంపోడ్, నిడమనూరు, త్రిపురారం మండలాల నుంచి ఆటోలు, ట్రాక్టర్‌లలో కూలీలను తీసుకువస్తున్నారు. ఒక రోజు కూలీ రూ.300లతో పాటు ఆటో కిరాయి, మేస్త్రీ మామూలు కలుపుకుని దూరాన్ని బట్టి రూ.350 నుంచి 400 వరకు చెల్లిస్తున్నారు. ఒక క్వింటా ఎండు మిర్చి ఏరటానికి పది మందికి పైగా కూలీలు అవసరం అవుతున్నారు. ఈ ఏడాది ఆశించినస్థాయిలో వర్షాలు పడటం, ఏఎమ్మార్పీ కాలువలకు వారబందీ ప్రకారం నీటిని విడుదల చేస్తుండటంతో మిరప పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయడంతో చాలా మండలాల్లో యాసంగి వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. దీంతో కూలీలకు తీవ్ర కొరత ఏర్పడింది. వరినాట్ల కంటే మిరప చేలు ఏరడం సులభం కావడంతో కూలీలు మిరప కోతలకు మొగ్గు చేపుతున్నారు. అయినా మిరప కోతలకు కూలీల కొరత తీవ్రంగా ఉంది.

4వేల వరకు ఖర్చు అవుతుంది



రోజుకు ఒక్కో కూలీకి రూ.300లు చెల్లించటంతో పాటు, వారిని తీసుకురావటానికి ఆటో కిరాయిలకు రోజుకు మరో రూ.1000 అదనంగా చెల్లిస్తున్నాం. దీంతో పండించిన పంటలో ముప్పై శాతం కూలీలకే సరిపోతుంది. క్వింటాకు కూలీలకు రూ.4000 వరకు ఖర్చు అవుతుంది. వరినాట్లు వేస్తుండటంతో ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉంది. అరకొర వస్తున్న కూలీలతో మిరప చేలు ఏరడానికి చాలా సమయం తీసుకుంటుంది. వరినాట్లు పూర్తయితే కూలీల కొరత కొంత తీరనుంది.

– కర్నాటి సైదిరెడ్డి, రైతు, పెద్దవూర